క్లుప్తంగా

సంప్రదాయాలను మరవొద్దు



శివ స్వాములకు ఆధ్యాత్మిక బోధన చేస్తున్న గురుస్వామి శైలేంద్రనాథ్

ఆదోని అర్బన్: హిందూ సంప్రదాయాలను మరవద్దని, లేని పోని సమస్యలను కొని తెచ్చుకోవద్దని గురుస్వామి శైలేంద్రనాథ్ సూచించారు. ఆదివారం స్థానిక శ్రీ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో శివమాలధారణ చేసిన శివ స్వాములకు ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. భగవంతుడు ఈ సృష్టిని నిర్మాణం చేశాడని, ఆయన సృష్టించిన దాన్ని పాడు చేయకుండా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటిస్తే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందన్నారు. ముందుగా శ్రీ శంభులింగేశ్వరస్వామికి పంచామృతఅభిషేకం, పూల అలంకరణ, జ్యోతిర్లింగ పడిపూజ, భజనలు, మహా మంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కర్ణాటక భక్తుల పాదయాత్ర



మంత్రాలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కౌతాళం: కర్ణాటక రాష్ట్రంలోని కాటిగి పట్టణం నుంచి భక్తులు మంత్రాలయానికి పాదయాత్రగా వెళ్లారు. పాదయాత్ర ఆదివారం కౌతాళం మీదుగా సాగింది. తమ బృందంలో 55మంది మంత్రాలయంలో వెలసిన రాఘవేంద్ర స్వామిని దర్శించుకోవడానికి బయలుదేరినట్లు పాదయాత్ర పెద్దలు ఉప్పనహాల్ ప్రభు, వీరేంద్రపాటిల్, మల్లికార్జున, మహేశ్‌స్వామిలు తెలిపారు. గత 30సంవత్సరాల నుంచి ఈ యాత్రను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత పాదయాత్ర చేయడం ఆనవాయితీగా మారిందన్నారు. సోమవారం మంత్రాలయం చేరి స్వామి దర్శనం చేసుకుంటామని వారు తెలిపారు.

పరమేశ్వరరావుకు నివాళి



పరమేశ్వర రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: నూతలపాటి పరమేశ్వర రావు 3వ వర్ధంతిని ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు రఘురామయ్య మాట్లాడుతూ సంఘానికి పరమేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్, డీఏ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం దారుణమన్నారు. ఉపాధ్యాయుల బదిలీలలో అకాడమిక్ ఇయర్‌ను కటఆఫ్‌గా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రామన్న, శాంత కుమార్, గోపి నాయక్, వెంకటేశులు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ మెంబర్‌గా ఓంప్రకాష్



కోసిగి: ఆంధ్ర ప్రదేశ్ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ స్టేట్ మెంబర్‌గా కోసిగికి చెందిన వ్యాపారవేత్తం ఎం. ఓంప్రకాష్ ఎంపికయ్యారు. ఆయన మారుమూల కోసిగి ప్రాంతం నుంచి వ్యాపార రంగంలో రాణిస్తూ 11 ఏళ్లుగా కర్నూలు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ మెంబర్‌గా, జిల్లా ఉపాధ్యక్షుడి కొనసాగారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీ మెంబర్‌గా ఎంపికచేశారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆదోని రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామానికి చెందిన ఖాదర్‌లింగ(19) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఖాదర్‌లింగకు సంబంధించిన పొలాలు ఆదోని మండలం హానవాల్ గ్రామంలో ఉన్నాయి. ఈనెల 16వ తేదీన పొలానికి వెళ్లి తిరిగి బైకుపై స్వగ్రామమైన కుంటనహాల్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేకపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

దేవరగట్టులో పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమార్చన, భండారార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, ఆకుపూజ మొదలైన ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. దర్శనం కోసం ఏపీ, కర్ణాటకతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

కొనసాగుతున్న వలసలు

- ఆదుకోని ఉపాధి పనులు
- గిట్టుబాటు కాని కూలి, సమయానికి అందని వేతనం
- పండుగ ముగియడంతో రైతులు, కూలీల వలసబాట
- రోజూ 20 నుంచి 30 కుటుంబాలు పట్టణాలకు పయనం



గుంటూరుకు వాహనంలో తరలివెళ్తున్న వ్యవసాయ కూలీలు



కోసిగి నుంచి టెంపోలలో వెళ్తున్న వలస కూలీలు

ఆదోని రూరల్: ఈ ఏడాది అతివృష్టి-అనావృష్టి కారణంగా పంటలు పండకపోవడంతో అటు రైతులు, ఇటు వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువయ్యింది. స్థానికంగా పనులు లేకపోవడం, ఉన్న అరకొర ఉపాధి పనుల్లో గిట్టుబాటు వేతనం అందకపోవడం, సకాలంలో చేసిన పనులకు వేతనం సరిగా జమ కాకపోవడంతో కూలీలు ఉపాధి పనులకు స్వస్తి చెప్పి పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. సంక్రాంతి పండగ ముగియడంతో డివిజన్ పరిధిలో వలసలు ప్రారంభమయ్యాయి. నిత్యం మండలంలోని ఏదో ఒక గ్రామం నుంచి 20 నుంచి 30 కుటుంబాల ప్రజలు పట్టణాలకు మూటా ముల్లె సర్దుకుని వలస వెళ్తున్నారు.

జి.హొసళ్లి నుంచి ఒక్క రోజే 60 కుటుంబాలు వలస

మండలంలోని జి.హొసళ్లి గ్రామం నుంచి ఆదివారం దాదాపు 50 నుంచి 60 కుటుంబాలు, కల్లుబావి నుంచి 20 నుంచి30 కుంటుంబాలు గుంటూరుకు మినీ లారీల్లో పిల్లాపాపలతో కలిసి వలస వెళ్లారు. పట్టణాల్లో పనులు చేస్తే తమకు రోజుకు రూ.400 నుంచి రూ.500 దాకా కూలి డబ్బులు వస్తాయని, తినడానికి అన్నం దొరుకుతుందని వారు తెలిపారు. ఉన్న ఊర్లో ఉపాధి పనులు సక్రమంగా లేకపోవడం, అరకొర ఉపాధి పనులు ఉన్నా చేసిన పనులకు గిట్టుబాటు వేతనం సకాలంలో రావడం లేదని వాపోతున్నారు. ఒకరోజు ఉపాధి పనికి వెళితే రూ.150 నుంచి రూ.200 లోపే పడుతుందని, ఎంత పనిచేసినా ఇంతే కూలి పడుతోందని వాపోయారు.

భరోసా ఇవ్వని ఉపాధి హామీ...

రైతులు, వ్యవసాయ కూలీలు స్థానికంగానే ఉపాధి కల్పించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రస్తుతం ప్రభుత్వాల కారణంగా కూలీలను ఆదుకోలేకపోతున్నాయి. చేసిన పనికి కూలీ గిట్టుబాటు కాక, సకాలంలో కూలీ డబ్బులు అందకపోవడంతో చేసేదేమి లేక తప్పని పరిస్థితుల్లో వలసబాట పట్టాల్సి వస్తోందని వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులు సైతం వలస బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదోని మండలంలో 44 గ్రామాలు ఉండగా, ఇప్పటికే దాదాపు 30 గ్రామాలకు పైగా వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు పట్టణాలకు ఉపాధి కోసం వలస బాట పట్టారు.

ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్న అధికారులు

మండలంలోని గ్రామాల్లోని కూలీలకు ఉపాధి పనులను పూర్తిస్థాయిలో కల్పించడంలో ఉపాధిహామీ అధికారులు విఫలమయ్యారు. పనులు అరొకరగా చూపుతూ వారికి గిట్టుబాటు వేతనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఉపాధి పనులపై కూలీలకు ఆసక్తి చూపడంలేదు. పిల్లాపాపలతో కలిసి పట్టణాలకు వలసలు వెళ్తున్నారు. గిట్టుబాటు వేతనం అందిస్తామని అధికారులు ఊదరగొడుతున్నా అవి ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యాయే గానీ ఎక్కడా ఆచరణలో లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

కొనసాగుతున్న వలసలు

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల నుంచి సంక్రాంతి పండుగ ముగిసిన నాటి నుంచి రోజు వారీగా బతుకుదెరువు కోసం వలసబాట పడుతూనే ఉన్నారు. ఆదివారం కోసిగిలోని కడపాళెం, నాగన్నగేరి, దుర్గిగేని, చింతలగేని, రామక్కమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సిద్దప్ప పాళెం, 1వ వార్డులోని ఎల్లమ్మవ్వ ఆలయ స మీపాల నుంచి దాదాపు 20 టెంపోలలో 1500 మంది కి పైగా తరలి వెళ్లారు. అలాగే ముగలదొడ్డి, చిర్తనక ల్లు, దుద్ది, ఆర్లబండ, వందగల్లు, చింతకుంట, అగసనూరు, సాతనూరు గ్రామాల నుంచి మరో 1000 మందికి పైగా తరలి వెళ్లి పోయారు. 19వ తేదిన మండల స్పెషల్ ఆఫీసర్, డీఈఓ శ్యాముల్ పాల్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మండలస్థాయి అధికారులతో కలిసి గ్రామా ల్లో పర్యటించి వలసలు వెళ్లవద్దు పనులు కల్పిస్తామని చెప్పినా కూలీల వలసలు మాత్రం ఆగడంలేదు.

పొట్టచేతబట్టి.. వలసబండి ఎక్కి



పిల్లా పాపలతో వలసబండి ఎక్కుతున్న కూలీలు

పెద్దకడబూరు : సంక్రాంతి పండుగ అయిపోయింది. గ్రామంలోని పంట పొలాల్లో పనులు కూడా అయిపోయాయి. ఉపాధి పథకం కింద చేసిన పనులకు సంబంధించి దాదాపు రెండు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వారం రోజులుగా ఉపాధి పనులు కూడా నిలిచిపోయాయి. ఉన్న గ్రామంలో పనులు కరువై కూలీలు పొట్ట చేతబట్టుకొని వలసబండి ఎక్కారు. మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో కూలీలు పనులు లేక ఆదివారం లారీలో గుంటూరు పట్టణానికి వలస వెళ్లారు. గ్రామంలో పనులు లేకపోవడం వల్లనే ఊరు వదిలి పోవాల్సిన దుస్థితి దాపరించిందని కూలీలు వాపోయారు. సంబంధి అధికారులు చొరువ తీసుకొని సమయానికి ఉపాధి బిల్లులు ఇవ్వడంతో పాటు ఉపాధి పనుల కల్పించి ఆదుకోవాలని కోరారు.

పిల్లలతో కలిసి గుంటూరుకు వలస వెళ్తున్నా



నాకు ఎకరా పొలం ఉంది. ఉన్న ఊరిలోనే పనులు చేసుకుని పిల్లలను చదివించుకోవాలని అనుకున్నా. అయితే ఈ ఏడాది పంటలు గిట్టుబాటు కాకపోవడంతో చేసేదేమి లేక పిల్లలను కూడా నా వెంట తీసుకొని గుంటూరుకు వలస వెళ్తున్నా. స్థానికంగా ఉపాధి పనులు కల్పించి, గిట్టుబాటు వేతనం కల్పిస్తే వలస వెళ్లే పరిస్థితి ఉండేది కాదు.

– మల్లికార్జున, జి.హొసళ్లి గ్రామ, కూలీ

మిరపకాయ పనుల కోసం వలస వెళ్తున్నా



మా గ్రామంలో పనులు లేకపోవడంతో మిరపకాయలను తెంచే పనుల కోసం గుంటూరుకు వలస వెళ్తున్నా. అక్కడ రోజుకు రూ.500కు పైగా కూలి లభిస్తుంది. నేను, నా భార్య, ఇద్దరు పిల్లలతో సహా గుంటూరుకు వలస వెళ్తున్నా. ప్రతిరోజూ ఉపాధిహామీ పనికి వెళ్లినప్పటికీ గిట్టుబాటు కూలి రావడం లేదు. దానికితోడు చేసిన పనికి కూడా సకాలంలో కూలి వేతనాలు పడకపోవడంతో చేసేదేమి లేక వలస వెళ్తున్నా.

– కుక్కల మహాదేవ, వ్యవసాయ కూలీ

వలసలతో ఖాళీ అవుతున్న గ్రామాలు

పాదలకుంట నుంచి వలస వెళుతున్న కూలీలు



కౌతాళం: వలసల పరంపర కొనసాగుతునే ఉంది. మండలంలో ఆదివారం కూడా వలసలు కొనసాగాయి. ఒక్కరోజే మండలం నుంచి దాదాపు 250 కుటుంబాలకు పైగా బెంగళూరు, హైదరాబాదు, గుంటూరు వంటి పట్టణాలకు వలస పోయాయి. మండల కేంద్రమైన కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్, మండల పరిధిలోని లక్ష్మీనగర్, డొమ్మలదిన్నె, కాత్రికి, పొదలకుంట, అగసలదిన్నె గ్రామాల నుంచి 250కు పైగా కుటుంబాలు లారీలు బొలెరో, టెంపోల వంటి వాహనాల్లో వలసల పోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ గ్రామాల నుంచి వాహనాల్లో మూటాముల్లె సర్దుకుని పిల్లలు, ముసలివారితో కలిసి ఊళ్లను వదలి పోవడం కనిపించింది. ఆదివారం ఒక్క పొదలకుంట గ్రామం నుంచే మూడు లారీలు, ఒక బొలెరో వాహనంలో తరలివెళ్లారు.

‘అమిత్‌షా గోబ్యాక్’



ఆదోనిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు



సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గన్నవరం మండలంలో కేంద్ర మంత్రి అమిత్‌షా పర్యటిస్తున్న నేపథ్యంలో వామపక్ష పార్టీల నాయకులు అమిత్‌షా గో బ్యాక్ అంటూ నిరసన తెలియజేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రదర్శన నిర్వహిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు గోపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు అజయ్‌బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు లక్ష్మన్న, గోపాల్, వీరేష్, నాగరాజు, వెంకటేష్, రామాంజనేయులు, వీరారెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్రంలో పర్యటించడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం పట్టణంలో కమ్యూనిస్టు పార్టీలు పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అమిత్‌షా గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు భాస్కర్ యాదవ్, రాముడు, ప్రసాద్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు మాట్లాడారు. రాజ్యాంగకర్తను అవమానించిన అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని టౌన్ /ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఉమామహేశ్వరి ఆదివారం తెలిపారు. మొత్తం 12 ఆయా పోస్టులు ఉన్నాయన్నారు. ఇందులో హవన్నపేట సెంటర్–1 (ఈడబ్ల్యూసీ), సుల్తానపురం(ఓసీ), పాండవగల్ (బీసీ–ఏ), బోయగేరి అంగన్‌శాడీ–2 (ఓసీ), పెద్దతుంబళం–3(ఈడబ్ల్యూసీ), మదిరె– 2 (ఎస్టీ), పెద్దహరివాణం – 8 (ఓసీ), సాదాపురం–2 (ఓసీ), నిజాముద్దీన్ కాలనీ –1 (ఓసీ), హవన్నపేట అంగన్‌వాడీ సెంటర్ 2 (ఓసీ)లో ఒక్కొక్కటి చొప్పున ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్బన్ అంగన్‌వాడీ కేంద్రంలో అభ్యర్థి తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు అయితే తప్పనిసరిగా అభ్యర్థి 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అంతకన్నా ఎక్కువ విద్యార్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

అభ్యర్థులు 01–07–2024 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల వయస్సు లోపు వారై ఉండాలన్నారు. తప్పనిసరిగా వివాహితులై ఉండాలని, స్థానిక నివాసితురాలై ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థినుల్లో 21 సంవత్సరాల వయస్సు నిండిన వారు లేనిచో 18 సంవత్సరాలు నిండిన వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అభ్యర్థులు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని శ్రీ జిహేశ్వర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2000–01వ సంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులు నాగరాజు, వెంకటేశ్, ధనుంజయ, నరసింహులు, శాంత, రాధతో పాటు పలువురిని సన్మానించారు. తోటి మిత్రులతో కలసి పాఠశాలలో కలయతిరిగారు. చిన్ననాటి అల్లరితో కూడిన ఆట పాటలు, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగ క్షేమాలను ఒకరు అడిగి తెలుసుకొన్నారు. చదువు ముగించుకొని ఉద్యోగ, వృత్తి రీత్యా అయా ప్రాంతాల్లో ఉన్నప్పటికి 25సంవత్సరాలు తర్వాత ఇలా కలుసుకోవడం చాల సంతోషంగా ఉందని పలువరు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు శంకర్, సుధాకర్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

ఆదోని అర్బన్: ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ (చేనేత) నూతన సంవత్సర క్యాలెండ్‌ను ఆదివారం కూటమి నాయకులు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాజం పెద్దలు సాకారే మారుతిరావు, కె.జి.వీరన్న, సాకరే ఈరన్న, రాసాలే గోవిందరావు, సాకారే లక్ష్మణ్, ఆర్కట్ శివసాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ఆదోని సెంట్రల్: ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీరేష్, నగర కార్యదర్శి ఉమేష్, గోవిందరాజ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఎమ్మెల్యే డా.పార్థసారథి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేద్దామన్నారు. నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ మహాసభలకు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ఎమ్మిగనూరు రోడ్డులోని నెట్టికల్ క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం రోడ్డుపై ప్రమాదాలను నివారించేందుకు ఏర్పాటు చేసిన డ్రమ్ములను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఢణాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, గోవర్ధన్ బైకుపై ఎమ్మిగనూరు నుంచి వస్తుండగా నెట్టికల్ క్రాస్ రోడ్డు సమీపంలో డ్రమ్మును ఢీకొని కింద పడ్డారు. గాయాలపాలైన ఇద్దరిని స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

శనగల డబ్బులు ఇప్పించండి

ఆదోని రూరల్: పత్తికొండ మండలం హోసూరుకు చెందిన రాముడు అనే వ్యక్తి 2021 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డికి 200 క్వింటాళ్ల శనగలు అమ్మాడు. అందుకు సంబంధించిన డబ్బు ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో రాముడు ఆదోని డీఎస్పీ సోమన్నకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. రామకృష్ణారెడ్డి, అతడి భార్య రంగమ్మ, బామ్మర్దిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ మేరకు డీఎస్పీ వారిపై కేసు నమోదు చేసి సంబంధిత పత్తికొండ పోలీస్‌స్టేషన్‌కు రెఫర్ చేయాలని ఆదేశించడంతో ఇస్వీ ఎస్‌ఐ నాగేంద్ర కేసు నమోదు చేశారు.

ఫిబ్రవరి 16 నుంచి అన్నదానం

ఆదోని అర్బన్: శ్రీశైలానికి ఆదోని మీదుగా పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఫిబ్రవరి 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు అల్కూరుమఠం మహర్షి విజయ్‌కుమార్ స్వామి ఆదివారం విలేకరులకు తెలిపారు. గత 13 సంవత్సరాల నుంచి అల్కూరుమఠం మహర్షి విజయ్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డులో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈనెల 26వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు ఆదోనిలోని మహర్షి పాఠశాలలో సమావేశం ఉంటుందని, దాతలు పాల్గొని వారి సలహాలను తెలియజేయాలని కోరారు.

రజకులు ఆర్థికంగా ఎదగాలి



కోసిగిలో ధోబీఘాట్‌ను పరిశీలిస్తున్న రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి. సావిత్రి

కోసిగి: రజకులు అన్నీ రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని రజక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి. సావిత్రి అన్నారు. ఆదివారం కోసిగిలో రజక సంఘం మండల అధ్యక్షుడు బసన్న, కులస్తులతో కలిసి సజ్జల గుడ్డం రోడ్డులో, కడపాళెం భూగేని చెరువు సమీపంలో ఉన్న ధోబీ ఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రజకులు కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని, వారు బట్టలు ఉతికేందుకు ఏర్పాటు చేసి ధోబీఘాట్లు పూర్తి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. నీటి సరఫరా లేక నిర్వహణలో లోపంలో రజకులు కులవృత్తిని చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ కింద నిధులు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వేమా రెడ్డి, ఈరన్న, వీరుపాక్షి, మూర్తి, శివ, విజయ్, గోపాల్, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి సెస్సు కేటాయించాలి

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం విశాలాంధ్ర కార్యాలయంలో జరిగింది. అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ మాట్లాడుతూ గ్రంథాలయం పేరుతో ప్రభుత్వం వసూలు చేస్తున్న 8 శాతం సెస్సును గ్రంథాలయాల అభివృద్ధికి మాత్రమే వెచ్చించాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ భావాలు కలిగిన కవి, రచయితలు అరసంలో సభ్యులుగా చేరవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కవితా సంకలనాన్ని అరసం ప్రచురిస్తుందన్నారు. జిల్లాలోని నూతన రచయితలు నుంచి సామాజిక కథలను సేకరించి కథా సంకలనం ప్రచురిస్తున్నామన్నారు. అరసం కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కవితలు, కథలను పంపదలిచిన వారు 99853 55456 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అరసం గౌరవ సలహాదారులు డాక్టర్ హరికిషన్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు పుల్లా రామాంజనేయులు, కేసీ మల్లికార్జున, సోమ భూపాల్, వెంకటరాముడు, వెంకటేష్, రాజా రమేష్, నగర ప్రధాన కార్యదర్శి ప్రమోద్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

21న కుంభోత్సవం

హాలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామంలో దేవమ్మదేవి, మారెమ్మదేవి కుంభోత్సవ కార్యక్రమాలను ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. 21న ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు గంగపూజ, కళసం కార్యక్రమాలు చేపడతామన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి అమ్మవార్ల ఊరేగింపు ఉంటుందన్నారు. 22న తెల్లవారుజామున 1:45 నుంచి 2:45 గంటల వరకు మేటి కుంభోత్సవం ఉంటుందన్నారు.

కబడ్డీ విజేత గుండ్లకొండ జట్టు

తుగ్గలి : మునిస్వామి ఉరుసు సందర్భంగా నల్లగుండ్లలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గుండ్లకొండ జట్టు విజేతగా నిలిచింది. పోటీలను పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ ప్రారంభించారు. ఫైనల్ పోటీల్లో ఆదివారం గుండ్లకొండ-వర్కూరు జట్లు తలపడగా గుండ్లకొండ జట్టు విన్నర్స్‌గా వర్కూరు జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో వెంకటాపురం, బోయ బొంతిరాళ్ల జట్లు నిలిచాయి. విజేతలకు వరుసగా దాతలు రంగప్ప, కోళ్ల రంగన్న రూ.20,016, మజీద్ రూ.15,016, సత్యప్రకాష్ రూ.10,016, దేవదాసుగౌడ్ రూ.5,016 నగదును అందజేశారు.

నమ్మించి మోసం చేసిన కూటమి

మద్దికెర : సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా అప్పులు తెస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వాగ్దానాలను అమలు చేయాలని డిమాండు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆదోని చాంపియన్స్ 11 ఐకాన్స్



11 ఐకాన్స్ క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు

ఆదోని రూరల్/ఆదోని సెంట్రల్: ఆదోనిలోని మున్సిపల్ క్రీడా మైదానంలో ఈనెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన ఆదోని చాంపియన్స్ ట్రోఫీ–2025 క్రికెట్ కప్‌ను 11 ఐకాన్స్ జట్టు దక్కించుకుంది. ఆర్గనైజర్ కె.ఎం.ముజీబ్‌అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 46 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి చేతులు మీదుగా బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా ఐకాన్ క్రికెట్ జట్టుకు రూ. 1,00,000 లు నగదు, ట్రోఫీ, రన్నరప్‌గా నిలిచిన ఫ్రీడం ఫైటర్ జట్టుకు రూ. 50,000లు నగదుతో పాటు ట్రోఫీని అందించారు. కార్యక్రమంలో నాయకులు విట్టా రమేష్, మల్లప్ప, శ్రీకాంత్‌రెడ్డి, దాతలు రాజాగౌడ్, సూర్యనారాయణ, మధుసూదనశర్మ, ఇంతియాజ్ పాల్గొన్నారు.